క్లుప్తంగా

పీ-4పై మున్సిపాలిటీలో వార్డు సభలు



పీ-4పై పట్టణంలో నిర్వహిస్తున్న సమావేశం

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీలో పావర్టీ పీ-4 (ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం)పై హౌస్‌హోల్డ్ సర్వేపై అవగాహన కార్యక్రమాలు మంగళవారం పట్టణంలోని కాకాతోపు, రంగాపురం, బజారువీధి, ఎద్దుల సంతవీధి సచివాలయాల్లో నిర్వహించారు. నిరుపేద కుటుంబాలను గుర్తించి వారి అభ్యున్నతి కోసం దీని ద్వారా ప్రభుత్వం కృషిచేస్తుందని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ అధికారులు, ఆయా వార్డుల కూటమి నేతలు పాల్గొన్నారు.

వర్షం కోసం..!



శెట్టిపల్లెలో అక్కదేవతలకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

బైరెడ్డిపల్లి: మండలంలోని శెట్టిపల్లెలో మంగళవారం గ్రామస్తులు అక్కదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులందరూ సుభిక్షంగా ఉండాలని మొక్కారు. వర్షాభావం నేపథ్యంలో ఇక్కడ అక్కదేవతలకు పూజలు చేయడం, పొంగళ్లు పెట్టడం ఆనవాయితీ.

యువకుడి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మునిరాజ

పుంగనూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు..మండలంలోని మంగళం కాలనీలో చంద్రమౌళి(23) నివాసం ఉంటున్నాడు. కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిని గమనించిన కుటుంబీకులు స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీటెక్ ద్వితీయ ఫలితాల్లో ప్రతిభ



బ్రహ్మిణి, కసిరెడ్డి తరక్షిత, కొట్టె వాగ్దేవి

కుప్పం రూరల్: కుప్పం ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్) ఆధ్వర్యంలో నిర్వహించిన మొదటి సంవత్సరం బీటెక్ ద్వితీయ సంవత్సరం ఫలితాలను కళాశాల చైర్మన్ బీసీ నాగరాజు, జేఎన్‌టీయూ పరిశీలకులు డాక్టర్ వీబీ.చిత్ర మంగళవారం విడుదల చేశారు. ఈ ఫలితాల్లో కుప్పం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు బ్రహ్మిణి 94.6%, కసిరెడ్డి రక్షిత 93.8%, కొట్టె వాగ్దేవి 92.9% అత్యధిక మార్కులు సాధించినట్లు చెప్పారు. బీసీ నాగరాజు మాట్లాడుతూ, తమ కళాశాలలో క్రమశిక్షణ, అంకిత భావం కలిగిన విద్యాభ్యాసం చేయడంతోనే విద్యార్థులు ఉత్తమ ఫలితాల సాధనకు కారణమని చెప్పారు. ఫలితాల విడుదలలో వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్, సెక్రటరీ సాగర్‌రాజ్, ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు



స్తంభాన్ని ఢీకొనడంతో దెబ్బతిన్న కారు

బంగారుపాళెం: మండలంలోని తుంబకుప్పం సబ్‌స్టేషన్ సమీపంలో బంగారుపాళెం–అరగొండ రహదారిపై మంగళవారం కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. స్థానికుల కథనం మేరకు.. బంగారుపాళెం నుంచి కాణిపాకానికి వెళ్తుండగా ఎదురుగా ద్విచక్రవాహనం అడ్డు రావడంతో తప్పించబోయి అదుపుతప్పి రహదారి పక్కన గల విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ సంఘటనతో పెద్దప్రమాదం తప్పింది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శ్రీవారి భక్తులకు అన్నదానం

పలమనేరు: కర్ణాటక రాష్ట్రం తుంకూరు ప్రాంతం నుంచి తిరుమలకు కాలినడక వెళ్తూ పలమనేరుకు చేరుకున్న భక్తులకు పట్టణానికి చెందిన మధు మంగళవారం భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చే శ్రీవారి భక్తులకు తనవంతు సాయంగా ఇలా చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

బండకిందపల్లె వద్ద నేషనల్ హైవే డ్యామ్ కింద కుంటను తలపిస్తున్న వర్షపు నీరు



బడికి దారేదీ..?

- నేషనల్ హైవే డ్యామ్ కింద ఐదు అడుగుల లోతు నీరు
- అవస్థలు పడుతున్న బండకిందపల్లె విద్యార్థులు

రొంపిచెర్ల: మండలంలోని బెంగుళూరు–తిరుపతి జాతీయ రహదారిలోని బండకిందపల్లె వద్ద డ్యామ్ కింద ఐదు అడుగుల లోతు వర్షపు నీరు నిలిచిపోయింది. ఐదు రోజులుగా వర్షాలకు ఇది చిన్నపాటి కుంటను తలపిస్తోంది. దీంతో ఆ డ్యామ్ కిందుగా బండకిందపల్లె హనుమంతరాయునిపేట స్కూలుకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ స్కూల్‌కు బండకిందపల్లె, సాయిబులపల్లె, బండకిందపల్లె దళితవాడ నుంచి మొత్తం 60మంది విద్యార్థులు ఆ స్కూలుకు వెళ్తున్నారు.వీరిలో 45మంది బండకిందపల్లె విద్యార్థులే. డ్యామ్ కింద ప్రాంతం కుంటలా మారడంతో 45 మంది విద్యార్థులు స్కూలుకు వెళ్లడానికి అవస్థల నడుమ ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లవలసి వస్తోంది. డ్యామ్ నుంచి స్కూల్‌కు 200మీటర్ల దూరం మాత్రమే. హైవే వేయడంతో దారి లేకుండా పోయింది. నీళ్లు నిండి విద్యార్థులు మునిగిపోయేలా ప్రమాదకరంగా ఉండడంతో బండకిందపల్లె నుంచి మట్లోళ్లపల్లె అండర్‌పాస్ మీదుగా రెండు కిలోమీటర్ల దూరం చుట్టుతిరిగి స్కూలుకు చేరుకోవాల్సి వస్తోంది. తమ పిల్లలను ద్విచక్రవాహనాలు ఉన్నవాళ్లు స్కూలుకు మరో మార్గంలో వెళ్తుండగా, తక్కిన వారు రెండు కిలోమీటర్ల దూరం కొండచుట్టు తిరునాళ్ల తరహాలో చుట్టుతిరిగి వెళ్లవలసి వస్తోంది. బండకిందపల్లె వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేస్తేనే విద్యార్థులను బడికి పంపుతామని 10 రోజుల క్రితం తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూలుకు పంపలేదు. దీంతో అధికారులు నేషనల్ హైవే ఇంజినీర్లతో చర్చించారు. బండకిందపల్లె వద్ద నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన డ్యామ్‌ను రోడ్డుగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. దీంతో ఇప్పుడు పిల్లలను బడికి ఎలా పంపాలని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు తగుచర్యలు తీసుకుని విద్యార్థుల సౌకర్యార్థం రోడ్డు వేయాలని కోరుతున్నారు.

బురదలో జర్ర్‌ర్ర్..!



బురదమయమైన ఎంకే పురం రోడ్డు

- జారి పడుతున్న మోటార్ సైక్లిస్టులు
- తారుజన్మ ఎత్తని మట్టిరోడ్డు
- రాకపోకలకు అవస్థలు పడుతున్న గ్రామాలు

శాంతిపురం: పలమనేరు– కుప్పం జాతీయ రహదారిలోని గుండిశెట్టిపల్లె నుంచి పంచాయతీ కేంద్రమైన ఎంకే పురానికి వెళ్లే దారి బురదమయం కావడంతో ఇక్కట్లు పాలవుతున్నారు. దాదాపు ఒకటిన్నర కిలోమీటరు దూరం ఉన్న ఈ మట్టి రోడ్డు ఇప్పటి వరకూ తారు రోడ్డుకు నోచుకోలేదు. ముల్లూరు, క్రిష్ణాపురం, చిన్నగాండ్లపల్లె గ్రామాల ప్రజలు శాంతిపురం వైపు వెళ్లడానికి మరో మార్గం ఉన్నా రాజుపేట రోడ్డు, వి.కోట వైపు ఈ మట్టి రోడ్డు మీదుగా వెళ్తుంటారు. చిన్నపాటి వర్షానికే బురద జన్మ ఎత్తుతున్న ఈ మట్టిరోడ్డులో రాకపోకలకు గ్రామస్తులు నానా పాట్లు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు బురదలో జర్ర్‌ర్ర్..మంటూ జారి మోటార్ సైక్లిస్టులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక కార్లు అయితే బురద దెబ్బకు వాటి రూపమే మారిపోతోంది. ప్రభుత్వం స్పందించి తారు లేదా సిమెంటు రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

పెద్దిరెడ్డిని కలిసిన నాయకులు



పెద్దిరెడ్డిని కలిసిన పలమనేరు వైఎస్సార్‌సీపీ నేతలు

పలమనేరు: రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని లిక్కర్ కేసులో అక్రమంగా అరెస్ట్ చేసిన నేపథ్యంలో పలమనేరు నియోజకవర్గ నాయకులు ఆర్.రాజేంద్రన్, ఆర్ శ్రీనివాసులు రెడ్డి, సుహేబ్ తిరుపతిలో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మంగళవారం కలిశారు. కూటమి ప్రభుత్వం తమను రాజకీయంగా ఎదుర్కోలేక, కక్ష కట్టి తప్పుడు కేసులు బనాయిస్తోందని, వీటికి భయపడేది లేదని, వీటిపై పోరాటం చేస్తామని పెద్దిరెడ్డి చెప్పారని తెలిపారు.

రాజకీయ కక్షతోనే మిథున్‌రెడ్డి అరెస్ట్

- వైఎస్సార్ సీపీ నేతలను టార్గెట్ చేస్తున్న కూటమి ప్రభుత్వం
- తప్పుడు కేసులు, అక్రమ అరెస్టులు
- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ యువరాజ్ విమర్శ



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీపీ, నాయకులు

వి.కోట : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి నిఅరెస్ట్ చేయడం అక్రమం, దుర్మార్గమని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ యువరాజ్ విమర్శించారు. మిథున్ రెడ్డి అరెస్ట్‌ను నిరసిస్తూ పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద పార్టీ నాయకులతో నిరసన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి వారు మాట్లాడారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ అరాచక పాలన చేస్తోందని, హామీలు నెరవేర్చకపోవడం, ప్రభుత్వ వైఫల్యాల ను ప్రశ్నించే ప్రజలు, నిలదీసే ప్రతిపక్షాలపై అక్ర మ కేసులు బనాయిస్తున్నారన్నారు. రాజకీయ కక్షతోనే మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేశారని, రాష్ట్రంలో అరెస్టుల కోసం చంద్రబాబు ఏరికోరి వేసుకున్న సిట్ బృందం ఆయన చేతుల్లో కీలుబొమ్మగా మారిందని మండిపడ్డారు. సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చకపోవడంతో కూటమి ప్రభుత్వం పాలన ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోందని, అందుకే ప్రజల దృష్టిని మరల్చేందుకు చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పనికట్టుకుని వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేసి, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం ప్రజలే చెబుతారన్నారు. అరెస్టులు, తప్పుడు కేసులకు వైఎస్సార్‌సీపీ భయపడేది లేదని, ఎన్ని కేసులు పెట్టినా మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకొస్తారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ డాక్టర్ తమీమ్, సర్పంచ్ లక్ష్మమ్మ, నాయకులు అమరనాథ్, చంద్రశేఖర్, ప్రతాప్‌రెడ్డి, పూలనాగ, పవన్ కుమార్, భూపతి, కుమార్‌రాజా, గోపిరెడ్డి, శ్యామ్, శ్రీనివాసులు, సుభాష్, శివరాం, రామకృష్ణ, మణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పారిశుద్ధ్య కార్మికులపై అధికారుల వేధింపులు



సమస్యలపై సమావేశమైన మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు

పలమనేరు: మున్సిపాలిటీలో కిందిస్థాయి అధికారుల నుంచి తమపై వేధింపులు ఎదురవుతున్నాయని, దీనిపై మున్సిపల్ కమిషనర్ జోక్యం చేసుకుని పరిష్కరించాలని పలువురు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రామచంద్రయ్య మాట్లాడుతూ, మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సిబ్బంది కొరత కారణంగా ఉన్నవారిపై పనిభారం పెరిగిందన్నారు. ఇళ్ల నుంచి తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా ఇవ్వకపోతే కార్మికులు మాత్రం ఏమి చేస్తారని ప్రశ్నించారు. పట్టణంలోని చెత్తకుండీలను తొలగించడంతో చెత్తను రోడ్లపై వేస్తున్నారని, ఈ సమస్యలపై కమిషనర్ చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో స్థానిక నేతలు నాగరాజు, చెన్నకేశవులు, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

వి.కోట: ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి మండల అధికారులు కృషి చేయాలని ఎంపీపీ యువరాజ్ కోరారు. మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. పలువురు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో తిష్ట వేసిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అగ్ర కులస్తులు అక్రమంగా ఎస్సీ, ఎస్టీల భూములను ఆక్రమించుకుంటున్నారని, అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలన్నారు. మండలంలో ఇప్పటికీ పలు ఎస్సీ, ఎస్టీ కాలనీలకు సీసీ రోడ్లు, శ్మశాన వాటికలు, వాటికి దారులు లేక ఇబ్బంది పడుతున్నట్టు చెప్పారు. మండలంలో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కమిటీ సభ్యులు కోరారు. ఆయా శాఖల అధికారులు అమలులో ఉన్న పథకాలను, దానికి సంబంధించి రాయితీలను వివరించారు. సమావేశంలో కమిటీ సభ్యులు ప్రస్తావించిన సమస్యలను వచ్చే సమావేశంలో పరిష్కరించాలని ఎంపీపీ కోరారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ఎంపీడీఓ, తహసీల్దార్, ఎంఈఓ, సభ్యులు పాల్గొన్నారు.

పంటల బీమాపై అవగాహన



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారులు

పూతలపట్టు(యాదమరి): వరి సాగు చేసే ప్రతి రైతూ తప్పనిసరిగా బీమా చేసుకోవాలని ఏఓ మధురవాణి అన్నారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌సీ ఏడీఏ నాగపద్మిని, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సంధ్యారాణి ముఖ్య అతిథులుగా రైతులతో మాట్లాడారు. ప్రస్తుత వర్షాకాలంలో వరి పంటపై పెనుప్రభావం చూపే ప్రమాదం ఉందని చెప్పారు. ఈదురు గాలులకు, భారీ వర్షాలకు పంట దెబ్బతినే అవకాశం ఉందని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వరి పంటపై బీమా చేసుకుంటే రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సెరికల్చర్ శాఖాధికారి ఆర్ముగం మాట్లాడుతూ, పంటలకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీల గురించి వివరించారు. శాస్త్రవేత్త సంధ్యారాణి మాట్లాడుతూ, నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని అధిక దిగుబడిని సాధించాలన్నారు. నాగపద్మిని మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలని కోరారు. అన్నదాత సుఖీభవ జాబితాలో తమ వివరాలను చూసుకోవాలన్నారు. లేనివారు ఈరోజు లోపల రైతు సేవాకేంద్రాల వద్ద నమోదు చేసుకోవాలని ఏఓ మధురవాణి రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నెలాఖరులోపు వేరుశనగ విత్తుకోవచ్చు



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

తవణంపల్లె: ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ విత్తనాలను ఈ నెలాఖరులోగా విత్తుకోవచ్చని వ్యవసాయాధికారి జి.ప్రవీణ్ తెలిపారు. మంగళవారం మండలంలోని సరకల్లులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విత్తనాలు విత్తేముందు విత్తనశుద్ధి చేయించాలన్నారు. రసాయన ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ, జీవన ఎరువులు వాడాలన్నారు. వేరుశనగలో అంతరపంటగా కందిని సాగు చేసుకోవచ్చన్నారు. చీడపీడలు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. రసం పీల్చే పురుగులు నివారణకు వేరుశనగ పంట చుట్టూ జొన్న, మొక్కజొన్న సాగు చేసుకోవచ్చన్నారు. అంతర పంటగా ఆముదపు మొక్కలను అక్కడ వేసుకోవడం మంచిదన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద రాగి, వరి, కంది పంటకు ఇన్సూరెన్స్ చేసుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే పంట కోత ప్రయోగాలతో దిగుబడిని నిర్ణయించి, మండలం యూనిట్‌గా ఇన్సూరెన్స్ చేసుకున్న రైతులకు మాత్రమే నష్టపరిహారం అందుతుందన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో వేరుశనగ పంటను క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ కుసుమ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠు, హెచ్‌ఐవీ నిర్మూలనే లక్ష్యం

–జిల్లా క్షయ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్

గంగాధర నెల్లూరు: కుష్ఠు, హెచ్‌ఐవీ, క్షయ తదితర వ్యాధుల నిర్మూలనే లక్ష్యంగా పని చేయాలని క్షయ వ్యాధి నిర్మూలన జిల్లా అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం వైద్యాధికారులు, సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. సికెల్ సెల్ అనీమియా స్క్రీనింగ్, క్షయ, హెచ్‌ఐవీ, కుష్ఠు లాంటి వ్యాధుల నిర్మూలనపై జీడి నెల్లూరు, తూగుండ్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్య సిబ్బందితో సమీక్షించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ గురు ప్రకాష్, సీహెచ్‌ఓ కృష్ణయ్య , సూపర్‌వైజర్ భగవతి, ఎంఎల్‌ఎల్ హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా బీజేపీ కార్యవర్గంలో ఇద్దరికి స్థానం

రొంపిచెర్ల: చిత్తూరు జిల్లా భారతీయ జనత పార్టీ కార్యవర్గంలో మండలానికి చెందిన ఇద్దరికి చోటు కల్పించారు. గానుగచింత గ్రామ పంచాయతీ చల్లింపల్లెకు చెందిన ఎ.వెంకటరమణ నాయుడుకు జిల్లా కార్యదర్శిగా, అలాగే కల్లావారిపల్లెకు చెందిన ఎం.ఇంద్రాణి కార్యవర్గ సభ్యురాలిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు నియామక పత్రాలు పంపారు.

ఘనంగా గ్రామ దేవతలకు పూజలు





నక్కబండలో పూజలందుకున్న మారెమ్మ, నక్కబండలో గంగమ్మ దీపాలు తీసుకెళ్తున్న మహిళలుత

పుంగనూరు: పట్టణ సమీపంలో నక్కబండలోని గ్రామదేవతలకు మంగళవారం గ్రామస్తులు పూజలు ఘనంగా నిర్వహించారు. స్థానికంగా మారెమ్మ, బోయకొండ గంగమ్మ, తిరుపతి గంగమ్మలకు మహిళలందరూ దీపాలతో మేళతాళాల నడుమ ఊరేగింపుగా వచ్చి మొక్కులు చెల్లించారు. వర్షాలు కురవాలని, పంటలు సక్రమంగా పండి, ప్రజలు సుభిక్షంగా ఉండేలా చూడాలని ప్రార్థించారు. గ్రామంలో విందు భోజనాలతో సందడి చేశారు.

భక్తులతో బోయకొండ కిటకిట



బోయకొండలో ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

- ప్రత్యేక అలంకరణలో గంగమ్మ
- మొక్కులు చెల్లించిన భక్తులు



భక్తుల రద్దీ

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం మంగళవారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆంధ్ర, కర్ణాటక, రాష్ట్రాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆషాఢ మాసపు చివరి మంగళవారం సందర్భంగా అమ్మవారికి కోరిన కోర్కెలు తీరిన భక్తులు తమ మొక్కులు చెల్లించారు. క్యూలైన్లన్నీ రద్దీతో కిక్కిరిసాయి. సుమారు 15 వేల మంది పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ ఈఓ ఏకాంబరం తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ట్రాఫిక్, రద్దీ దృష్ట్యా భక్తులు అవస్థలు పడ్డారు. ఆలయ సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.